# భారతీయుల సర్వకర్మలు వేదముననుసరించియే నిర్వహింపబడతాయి!

సకల వేదాంతగ్రంథాలసారమెల్ల
ఒక్క వాక్యాన చెప్పుదునొక్కసారి
అఖిలభూతములందున్న ఆత్మ నేను
ఒక్కటేయని మది తలపోయరయ్య

ముక్తికోరి నరుడు ముక్కోటి దేవతల
వేడుచుండు కాని వెతలు బోవు
తనయందు వున్న అహమును వీడిన
ముక్తియేల? తానె ముక్తుడగును

ప్రేమస్వరూపులారా!

వేదమనగా మంత్రదష్టలైన ఋషుల సత్యవాక్సమూహమే! వేదము అనంతమైనది, అగాధమైనది, అవాఙ్మానస గోచరమైనది. అట్టి అనంతమైన వేదమును అధ్యయనము చేయుటకు సామాన్యమైన మానవునకు సాధ్యము కాదని తెలుసుకొని వ్యాసుడు దానిని కొన్ని భాగములుగా ఋక్కులన్నియు వేరుచేసి ఋగ్వేదమనియు, యజుస్సులంతయు వేరుజేసి యజుర్వేదమనియు, సామమునంతయు వేరుచేసి సామవేదమనియు విభజించాడు. తిరిగి ఒక్కొక్క వేదమునందు మూడు విధములైన సంహితములనేర్పరిచి ఒకటి బ్రాహ్మణములని, రెండవది ఆరణ్యకములని, మూడవది ఉపనిషత్తులని వ్యవహరించాడు.

**వేదములు మానవుడు తన నాలుగు ఆశ్రమములందు ఆచరించవలసిన ధర్మమును బోధించాయి**

బ్రాహ్మణములనగా మంత్రమునకు సంబంధించినవి. ఈ మంత్రముల ద్వారా



sri sathyasai vachanamrutam

యజ్ఞయాగాది క్రతువులు లోక కళ్యాణ నిమిత్తమై, సమాజ కళ్యాణ నిమిత్తమై, మానవ జీవిత కళ్యాణ నిమిత్తమై నిర్వహించబడేవి అని తెలియజేశాడు. ఋక్కులు ఋగ్వేదముయొక్క ప్రధానమైన సూత్రములుగా ఏర్పరిచి 'బ్రాహ్మణములు' అని పేరు పెట్టాడు. ఋగ్వేదముయొక్క సారము వినయ విధేయతలను నిరూపించుటయే. ఇంక యజుర్వేదముయొక్క తత్త్వము ధారణాశక్తి. దీనిని ఆరణ్యకములు అని పేర్కొన్నారు. ఆరణ్యకములు అని పేరు రావటానికి కారణం ఏమిటి? మానవుడు గృహస్థుడుగావుండి, వానప్రస్థుడుగా అరణ్యములో ప్రవేశించి, భగవచ్చింతనయందు తన కాలమును, కాయమును, కర్మమునుకూడను అంకితముగావించుకుంటూ, దైవధ్యానముగావించటంచేత, దీనికి 'ఆరణ్యకములు' అని పేరు వచ్చింది. వానప్రస్థాశ్రమమును స్వీకరించిన మానవుడు అరణ్యమునందు ప్రవేశించి దైవధ్యానమును, దైవ చింతనను గావించుచూ యీ మంత్రములను వుపయోగించుకొటంచేత వీటికి ఆరణ్యకములని పేరు. ఇక సామము అనేది ప్రత్యేకించిన స్వరూపాన్ని ధరించినది. మానవుడు నిరంతరము ఆనందముతోను, ఉత్సాహముతోను, ఉల్లాసముతోనూ, జీవితము గడపవలెనన్న, కొన్ని విధములైన భావరాగతాళములతోకూడిన నాదోపాసన అవసరము. సమస్త సంగీతములకు మూలము సామవేదము. కనుక, దీనిని ప్రత్యేకించి అన్ని వేదములయందుకూడను దీనియొక్క అంతర్‌సారమును యిముడుస్తూవచ్చాడు వేదవ్యాసుడు.

వేదములు మానవులకు నియమింపబడిన నాల్గు ఆశ్రమములకు సంబధించినవి. బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, సన్యాసము యీ నాలుగు ఆశ్రమములందు మానవుడు అనుసరించవలసిన ధర్మమును, తద్వారా పొందవలసిన దివ్యత్వాన్ని వేదములు బోధిస్తూవచ్చాయి. ఇంతే కాకుండా, చతుర్విధపురుషార్థములకుకూడను యివి చాలా ప్రధానమైన అర్థస్వరూపాలుగా నిలుస్తూవచ్చాయి. ధర్మ, అర్థ, కామ యీ మూడుకూడను మానవ జీవితములో అత్యవసరమైనవి. అయితే వీటిని సక్రమముగా సరైన మార్గములో అనుభవించి, ఆచరించి, ఆదర్శవంతముగా నిరూపించుటకు యీ వేదములు ప్రమాణములుగా నిల్చినాయి. భారతీయులయొక్క సర్వ కర్మలుకూడను

srisathyasai vahini.org

వేదముననుసరించియే, వేదార్థముననుసరించియే నిర్వహింపబడతాయి.

**జగత్తంతా బ్రహ్మమయమే!**

'అనంతో వై వేదాః!' అన్నారు. వేదములు అనంతములైనప్పటికిని మూడు వేదములు మాత్రము ప్రధానంగా అధ్యయనం చేయబడుతూ వచ్చాయి. వీటి లక్ష్యము మానవ కళ్యాణమే! వేదమనగా బ్రహ్మతత్త్వాన్ని నిరూపించేది. 'వేదేశిరోబ్రహ్మ'. ఈ జగత్తంతా బ్రహ్మమయమే! ఇది శబ్దస్వరూపమైనది. బ్రహ్మతత్త్వము ఎనిమిది విధములుగా కీర్తింపబడుతూవచ్చింది:

**శబ్దబ్రహ్మమయి చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి**
**నిత్యానందమయి పరాత్పరమయి మాయామయి శ్రీమయి**

యిలాంటి మార్గములయందు దివ్యత్వమైన యీ వేదసారము మానవ కళ్యాణ నిమిత్తమై యిన్ని మార్గములుగా ప్రసరిస్తూ వచ్చింది. అయితే, యీ వేదములన్నికూడను కాలప్రవాహంలో లోకసంబంధమైన విద్యలకు మాత్రమే సమన్వయమైనాయిగాని, లోకాతీతమైన తత్త్వమును గ్రహించటానికి జనులను వుత్సాహ పరచలేదు. దీనినే పరవిద్య, అపరవిద్యలని వ్యవహరిస్తూ వచ్చారు. వేదములన్నియు అపరవిద్యలే! దుఃఖనివృత్తికి, ఆనందప్రాప్తికి యీ వేదములు బోధించే మార్గములు మానవునికి ధైర్య, సాహసములను, ఉత్సాహములను ప్రకటిస్తూ వచ్చాయి. ఇవి ధర్మ, అర్థ, కామములకు మూడింటికి మాత్రమే సమన్వయమైనవి. అయితే మానవుని నాలుగవ పురుషార్థమైన మోక్షము కేవలము జ్ఞానముచేతనే లభిస్తుంది. ఈ జ్ఞానము యేరీతిగా మనకు లభిస్తుంది? 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః'. త్యాగముచేతనే మనకు యీ అమృతత్వము లభిస్తుంది కాని లోకసంబంధమైన కార్యమువల్లగాని, పఠనవల్లగాని, సాధనవల్లగాని, ధ్యానమువల్లగాని, జపమువల్లగాని చేకూరదు. మనము నేడు గావించే సర్వవిధములైన సాధనలన్నియు లోకసంబంధమైనవే! అభీష్టఫలసిద్ధి నిమిత్తమై ఆచరించేవే! కేవలము మనోభీష్టాన్ని నెరవేర్చేటువంటివే!

**పరమ ప్రేమతత్త్వమే మోక్షము**



srisathyasaivachanamrutam

మనసుకు అతీతమైన తత్త్వమే, యీ ఆధ్యాత్మికతత్త్వము. ఈనాడు మనము ఆచరించే సర్వకర్మలకుకూడను కొన్ని కారణములుంటున్నవి. కొన్ని ప్రమాణములుంటున్నవి. కొన్ని హద్దులుంటున్నవి. ఆధ్యాత్మిక తత్త్వమనేది అన్నింటికిని అతీతమైనది. దీనిని 'మోక్షతత్త్వము' అన్నారు. 'మోహక్షయం, మోక్షం'. పరమ ప్రేమతత్త్వమే మోక్షము. ఈ ప్రేమతత్త్వము పొందటానికి మనకు ఏమి అడ్డు తగులుతున్నవి? పవిత్రమైన పరమప్రేమతత్త్వానికి ప్రయాణమై వెళ్లుతున్నప్పుడు మార్గ మధ్యములో అనేకమంది దీనికి ఆటంకములు కల్గించటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రపథమంగా ఆరుమంది దొంగలు మన సాధనకు అడ్డు తగులుతున్నారు. వారే కామక్రోధలోభమదమాత్సర్యములనేవారు. ఈ ఆరుమంది దొంగలు అడ్డుపడి మన పవిత్రమైన సాధనకు యే మాత్రము అవకాశము నందించటంలేదు. పోనీ యేదో ఒక సాధనచేతగాని, యింకే విధమైన దైవానుగ్రహముచేతగాని దీనిని సాధించి ముందుకు వెళ్లుదామా అంటే అక్కడ మళ్ళీ అష్టమదములు అనేవి అడ్డుతగులుతున్నాయి. ఇందులో మొదటిది ధనమనే మదము. తరువాత వరుసగా అధికార మదము, బలమదము, యవ్వన మదము, విద్యా మదము, సౌందర్యమదము, రాజ్యమదము మరియు తపో మదము. ఈ విధములైన మదములన్నీకూడను మానవునికి అడ్డుతగిలి తనయొక్క పవిత్రమైన భావములను ఆధ్యాత్మిక మార్గమునుండి మరల్చుతూవచ్చాయి. ఈనాడు మానవుడు ఒక్క మదముకాదు, అష్టమదములతో నిండివుంటున్నాడు. ధనము లేకపోయినా బలము వున్నదనే మదము. ఈ బలము లేకపోయినా యేదో ఒక విద్యవున్నదనే మదము. ఈ విధంగా అనేక మదములతో నిండి మానవుడు ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు. మానవునికి ఈ మదపిచ్చి తగ్గాలి. ధనము లేకపోయినా ధనము వున్నట్టుగా గర్విస్తున్నాడు. విద్య లేకపోయినా గొప్ప విద్యావంతుడనని అహంకారపడుతున్నాడు. బలము లేకపోయినా తానే ఒక కింగ్‌కాంగ్ మాదిరి భావిస్తున్నాడు. ఇది అంతా ఎంతకాలము? క్షణభంగురమైన మానవ జీవితంలో ఈ బలములన్నీ కదలిపోయే మేఘములవంటివి. ఈనాడు ఒక పదవిలో వుంటున్నానని గర్వపడవచ్చు. ఈ పదవి ఎంతకాలము? రిటైరు అయినతరువాత నీ ముఖము ఎవ్వరూ చూడరు. పదవి వున్నంతవరకు అనేకమంది పరిచారకులంతా వుండవచ్చు. ఈ పదవి తీరిపోతూనే ఎవరూ

కనీసం good bye కూడా చెప్పరు. ఇవన్నీ తాత్కాలికమైన, తుచ్ఛమైన పదవులు. ఈ తుచ్ఛమైన మదములకు మానవుడు అంకితమైపోయి తన దివ్యత్వాన్ని తాను మరచిపోతున్నాడు.

**మానవుడు తన ఆత్మవిశ్వాసముపై ఆధారపడటంలేదు**

తన ఆత్మబలముపైన తాను విశ్వాసము కోల్పోతున్నాడు. ఒక చిన్న పక్షి ఒక కొమ్మపైన వాలినప్పుడు కొమ్మ అటూ యిటూ కదలితే తాను యేమాత్రము భయపడదు. కారణమేమిటి? తాను ఆ చెట్టు కొమ్మపైన ఆధారపడలేదు. తన రెక్కలపైన ఆధారపడింది. పక్షైనా తన రెక్కలపైన తాను ఆధారపడివుంటుందిగాని మానవుడు తనయొక్క ఆత్మవిశ్వాసముపైన తాను ఆధారపడటంలేదు. పరులపైన ఆధారపడివుంటున్నాడు. పదవులకోసమై రకరకాల బాధలు పడుతున్నాడు. ఈ విధమైన దురవస్థలకు గురి కావటానికి దురాశనే మూలకారణము. మానవుని ఆశకు అంతమే లేదు. ఒక చెట్టు తొఱ్ఱలోపల ఒక పక్షి వున్నదనుకోండి. చెట్టుకు ఏదైనా ప్రమాదం జరిగితే యీ చెట్టు తొఱ్ఱలో వున్న పక్షి బుర్ మని ఎగిరిపోతుంది. తాను యేమాత్రము విచారించదు. అదే మానవునికి ఏమైనా కొంప అంటుకుంటే వాడు బయటకు వస్తాడు, గట్టిగా కేకలు వేస్తాడు. విలువైన సామానులు పోయెనే, నా బట్టలు పోయెనే, నా నగలు పోయెనే యీ విధమైన రీతిగా మానవుడు రోదన చేస్తాడు. ఇల్లు అంటుకున్నప్పుడు ఏడుస్తున్నాడుగాని, తన ప్రాణమే పోయినప్పుడు ఏంచేస్తాడు? ఈ నగలకోసం ఏడుస్తూపోతున్నాడా? లేదే? అంత్యకాలంలో తాను కట్టిన యిల్లునుకూడను తాను విడచిపెట్టిపోతున్నాడు. చివరకు తాను స్వయంగా నిర్మించిన యింటిలోకూడా వాని దేహమును పెట్టరు. బయటకు పంపించివేస్తారు. బ్యాంకులోని బ్యాలన్సు తనవెంటరాదు. పిడికెడు మట్టైనా తన వెంటరాదు. అలాంటి పరిస్థితిలో సర్వము విడిచిపెట్టి ఎలా వెళ్లిపోతున్నాం? మనది కాదు కనుక! మనదే అయితే మన వెంటరావాలికదా! ఈ విధంగా మనదికానిది, మనవెంటరానిది అయిన వస్తు సంపదకోసం ఆరాటపడిపోతున్నాం. ఇవన్నియు అనిత్యం, అశాశ్వతం, అసత్యం అనేటువంటి సత్యమును గుర్తుచేసి త్యాగమును బోధించేదే వేదము. దీనినే 'త్యాగేనైకే

srisathyasaivachanamrutam

అమృతత్వ మానసుః' అని చెప్పింది, వేదము. త్యాగములో ఎంత క్షేమము వుంటుండాదో మీరు యోచన చేసుకోవాలి. ఒక్కతూరి మనము భుజిస్తున్నాము. ఈ లోడు చేసుకున్న పదార్థం తిరిగి మరొక ద్వారం ద్వారా unload కాకపోతే పొట్ట పగిలిపోతుంది. మనము గాలిని లోపలికి తీసుకుంటున్నాము. అలా తీసుకున్న గాలిని మరొక విధముగా వదలకుండాపోతే lungs అంతా చెడిపోతాయి. మన శరీరములోని రక్తనాళములన్నిటిలో నిరంతరాయంగా రక్తము ప్రసరిస్తూ వుంటున్నాది. ఈ రక్తం ప్రసరించకుండా పోతే అక్కడ పుండు అవుతుంది. కనుక, త్యాగముచేతనే అన్ని విధాలా మనకు క్షేమం చేకూరుతున్నాది. భోగముచేత మనకు కేవలం రోగమే! కనుకనే 'త్యాగేనైకే అమృతత్వ మానసుః' అని వేదములంతా బోధించాయి.

**మానవుడు తన అభిమాన, మమకారములను తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి**

'నాది, నాది' అనే అభిమానమే మానవుని సమస్త బాధలకు మూలకారణము. ఒక చిన్న కథ. ఒక జమిందారుయొక్క భూమిని ఒక రైతు అతనితో సంప్రదించుకొని యింతకాలము నేను సాగుచేసుకుంటానని ఒక ఎగ్రిమెంటు చేసుకున్నాడు. పది సంవత్సరములవరకు యీ భూమిని నేను పండించుకొని యింత ధనము చెల్లిస్తాను, అని ఒక నిర్ణయము చేసుకున్నాడు. ఈ పది సంవత్సరములంతా రైతు ఆ భూమిని చక్కగా దున్ని పంట పండించుకొని అందులో జమిందారుకు యివ్వవలసినది యిచ్చి, తాను వుంచుకోవలసినది వుంచుకొని కాలము గడుపుతూ వచ్చాడు. అయితే ఈ రైతు, ఆ జమిందారు యిద్దరు చేసుకున్న ఎగ్రిమెంటు రైతుకుమారునకు తెలియదు, పాపం! చిన్నవాడు. ఈ పది సంవత్సరములు పూర్తయిన తరువాత పదకొండవ సంవత్సరము ఆ జమిందారు మనుషులొచ్చి భూమిని స్వాధీనం చేసుకొని దున్నడం మొదలుపెట్టారు. అది యీ రైతుయొక్క కుమారుడు చూచాడు, అడ్డుపోయాడు. "మా భూమిని మీరు ఎట్లా దున్నుతున్నారు? యిందులో ప్రవేశించటానికి వీలు లేద"న్నాడు. ఆ దున్నుతున్న పని మనుషులు "యిది మీదికాదు, మా జమిందారుది వెళ్లిపొమ్మ"ని చెప్పినారు. అనేకరకములుగా వారితో పోట్లాట జరిగింది. ఈ రైతు కుమారునికి చాలా కోపం వచ్చింది.

sri sathyasai vachanamrutam

మా భూమిని మీరు బలవంతముగా తీసుకుంటున్నారని చాలా బాధపడ్డాడు. తండ్రి దగ్గరకుపోయి చాలా బాధపడుతూ "నాన్నా! మన భూమి జమిందారు ఆక్రమించుకున్నాడ"ని, అనేక విధములుగా ఆవేశముతో మాట్లాడాడు. అప్పుడు తండ్రి శాంతముగా కుమారునికి చెపుతున్నాడుః 'నాయనా అది మనది కాదు. పది సంవత్సరముల ఎగ్రిమెంటు వ్రాయించుకున్నాము. ఆ నియమము దాటిపోయింది. కనుక, వారి భూమి వారే తీసుకున్నారు' అన్నాడు. ఈ యదార్థము తెలియజేసేటప్పటికి కుమారునికి ఆవేశము తగ్గిపోయింది. కోపముకూడ తగ్గిపోయింది. సత్యమును గుర్తించుకున్నవాడు కాబట్టి దుఃఖమును అణచుకున్నాడు. ఈ పిల్లవానికోపము జమిందారుపైనా లేక రైతుపైనా లేక భూమిపైనా? అదేదికాదు. Workers పైనకాదు, land lord పైనకాదు, భూమిపైనకాదు. ఆ భూమిపై వున్న అభిమానముతో యింత బాధపడ్డాడు. అందువలన 'ఇదినాది', అనే అహంకారము పోవాలి. తాను చేస్తున్నపనిలో మరొకరు ట్రాన్ఫరు అయి వచ్చి చేరిపోతాడు. అది తనది ఎట్లా అవుతుంది? ఈ తుచ్ఛమైన, క్షణికమైన అహంకారముచేతనే మానవుడు అధఃపతనమై పోతున్నాడు. కనుక, మొట్టమొదట మానవత్వమనేదానిని కొంతవరకు గుర్తుంచుకుని యీ బాహ్యసంబంధమైన అభిమాన, మమకారములను కొంచెము తగ్గించుకోవటానికి ప్రయత్నము చేయాలి.

## సమస్తప్రాణులు దైవ స్వరూపాలే అనే విశ్వాసమును బలపర్చుకోవాలి

మానవుడు తన జీవితంలో అన్నీ సుఖంగా వుండినంతవరకు, సర్వాన్ని మరచిపోతాడు. తననుతానే మరచిపోతాడు! ఇంక అంతానాదే, యీ ఆఫీసంతా నాదే అని అహంకారముగా ప్రవర్తిస్తాడు. ఇదంతా ఎవరిది? 'నేను కేవలం ఒక ఏజంటుగా వచ్చాను, ఇదంతా నాదికాదు' అనే సత్యాన్ని గుర్తించాలి. 'ఇది, నాయొక్క కర్తవ్యము. కర్తవ్యమును నిర్వర్తించటమే నాయొక్క ధర్మము' అనే భావముతో కర్మలను ఆచరించినప్పుడే సుక్షేమాన్ని మనము అనుభవించగలము. ఒక చిన్న విషయము. వేదములు అనేక విధములైన ప్రమాణములు ఏర్పరిచినవి. ఈ ప్రమాణములను మనము సరైన రీతిలో అనుసరిస్తున్నామా? లేదా? అని ఎవరికి వారు యోచించుకోవాలి. మొట్టమొదట తాను

srisathyasaivahini.org

తనయొక్క దివ్యత్వాన్ని విచారణ చేయాలి. 'సర్వతః పాణి పాదం తత్సర్వతోక్షి శిరోముఖం....' దివ్యతత్త్వము సర్వత్రా వ్యాపించివున్నది. ఈ జగత్తంతయు పంచభూతములతో నిండియున్నది. పంచభూతములయొక్క ప్రమాణమే యీ ప్రపంచము. ఇలాంటి ప్రపంచములో మనము జీవితం గడుపుతూ అహింసాతత్త్వాన్ని అనుసరించాలంటే యిది అసాధ్యమైన విషయము. మనము అడుగుపెట్టిన దగ్గరంతా ఎన్నో ప్రాణులు చనిపోతున్నాయి. మన ఉచ్ఛ్వాసనిశ్వాసములందుకూడా ఎన్నో సూక్ష్మమైన ప్రాణులంతా చనిపోతున్నాయి. మనం త్రాగే నీరులోపల యెన్నో ప్రాణులు పోతున్నాయి. మన యింటిలోపల పరిశుద్ధము చేసే సమయములో ఎన్నోకోట్ల ప్రాణులు పోతున్నాయి. ప్రపంచమంతాకూడా పంచభూతములే వున్నాయి. ఇలాంటి పంచభూతములమధ్య తాను నివసిస్తూ జీవహింస చేయకుండా వుండటమంటే సాధ్యమవుతుందా? అయితే, యివన్నీ మనకు తెలియకుండా జరుగుతున్నాయి. తెలిసి మాత్రం చేయకూడదు. దీనినే 'అహింస' అన్నారు. కంటికి కనుపించేది, చెవులకు వినిపించేది, మనసును మురిపించేది, హృదయాన్ని మరపించేది ఇలాంటి తత్త్వాన్ని మొట్టమొదట మనం గుర్తించాలి. కంటికి కన్పించేదానిని హింసించకూడదు. అనగా ఒక ప్రాణి అటు పోతూవుంటుంది. తెలిసి దానిని మనం చంపకూడదు. తెలియకుండా ఎన్నో కోట్లు జీవులు మరణిస్తున్నాయి. 'సర్వత్రావుండిన ప్రాణులు దైవంయొక్క స్వరూపాలే' అనే విశ్వాసాన్ని బలపరచుకోవాలి. 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ'. 'ఉన్నది ఒక్కటే! అన్నింటియందును దాని అంశమే', అనే తత్త్వమును మనము విశ్వసిస్తే మనం ఎవరిని ఏ విధముగాకూడను బాధించము. మానవులుగా జన్మిస్తున్నాము, కాని మానవత్వాన్ని మనము మరచిపోతున్నాము. అందరు మానవులైనప్పటికిని అందులో గుణములు వ్యత్యాసము చేసుకొని వివిధరకాలుగా వుంటున్నారు. జన్మను మనము ఆధారం చేసుకోకూడదు. గుణమునాధారంగా తీసుకోవాలి. బురదలో కమలం పుట్టింది. అది పుట్టినది బురదలో అయినప్పటికి, కమలం భగవంతుని శిరస్సుపైన నిలచిపోతుంది. దీనియొక్క గుణమును పురస్కరించుకొనియే ఆ స్థానము దానికి లభించింది. కనుకనే మానవత్వములో గుణతత్త్వాన్ని మనము అభివృద్ధిపరచుకోవాలి. జన్మతత్త్వాన్నిగాని, కులతత్త్వాన్నిగాని మనం ఏమాత్రం విచారణ

చేయరాదు. గాలిది ఏ కులము? అందరం పీల్చుకుంటున్నామే! బ్రాహ్మణులకొక గాలి, వైశ్యులకొక గాలి, క్షత్రియులకొక గాలి, శూద్రులకొక గాలి వుంటుందా? గాలికి కులంలేదు. అదే విధంగా మనము త్రాగే నీటికికూడా కులంలేదు. అందరమూ అవే నీళ్లు త్రాగుతున్నాము. దైవసృష్టియందు పంచభూతములకు మధ్య భేదములే లేవు. ఆకాశానికి కులంలేదు. అగ్నికి కులంలేదు. గంగకు కులంలేదు. గాలికి కులంలేదు. దేనికి కులంవుంది? భూమిపైన వుండినవారే యీ కులాల భేదము పెట్టుకుంటున్నారు. 'భూమము', అని వుంది వేదాంతములో. అనగా సర్వవ్యాపకత్వము అని. అలాంటి భూతత్త్వాన్ని మనం అనుభవించాలి. నీవు కొనుక్కున్న ఒక్క ground కి మాత్రము నీవు compound కట్టుకోవచ్చు. ఇదంతా నా గృహమని దానికి హద్దు పెట్టుకోవచ్చు. అయితే, భూమిపైన నీవు హద్దుపెట్టుకున్నావేగాని ఆకాశంలో యిది నా యింటికి తగినంత అని ఏమైనా compound పెట్టుకోగలిగావా? హద్దులేదే అక్కడ! ఆకాశములో నీ యింటిపైన విమానము తిరిగెనా నీవు అడ్డము చెప్పడానికి లేదు. మనము కేవలము సంకుచితమైన భావముతో యీ భూమిమీద హద్దులనంతా నియమించుకొని మనకాలాన్ని వ్యర్థం చేసుకుంటున్నాము. మన విద్య, మన బలము, మన కులములు, మనయొక్క ఐశ్వర్యము సర్వముకూడను క్షణభంగురములు.

**నీతి అనగా పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి కలిగియుండటం**

అసలు మన ప్రాణమే క్షణభంగురము! ఏ క్షణములో యిది శరీరాన్ని వదలిపెట్టి పోతుందో ఎవరు చెప్పలేరు. యీ అనిత్యమైన స్థితిలోపల యీ రాగద్వేషాలతో మనయొక్క కాలమును ఎంత పాడుచేసుకుంటున్నాము! అమూల్యమైన కాలమును మనము అరక్షణమైననూ వృథా చేయరాదు. ఈ ఆధునిక యుగములోపల యువకులైనవారియొక్క జీవితాలు కుక్కలకంటే హీనమైపోతున్నాయి. బజారులో సంచరించే కుక్కలకైనా కొన్ని హద్దులుంటున్నాయి. వాటికైనా ఒక నీతి, నిజాయితీ వుంటుండాది. కాని, యీనాటి మానవునికి నీతి, నిజాయితీలేదు. వాటికైన ఒక కృతజ్ఞత వుంటుండాది. కాని, మనిషికి ఆ కృతజ్ఞతలేదు. ఇలాంటి వానిని మానవుడని ఎట్లా చెప్పేది? కేవలం రాక్షసుడనే

srisathyasai vahamrutam

చెప్పవచ్చును. అలాంటివానికి ఎన్ని చదువులుంటుండి యేమి ప్రయోజనము? ఈ చదువులు కేవలము పొట్టకూటికోసం. పొట్టనింపుకోవడమే ప్రధానం అనుకున్నప్పుడు, బజార్లో beggars అంతా పొట్టను నింపుకోటంలేదా? కుక్కలు పొట్టనింపుకోటంలేదా? కోతులు పొట్టనింపుకోటంలేదా? పొట్టనింపుకోటం కోసమా చదువులు? మూడు దినములు మనము బ్రతికినాగాని, నీతిగా బ్రతకాలి. నీతి అనగా ఏమిటి? నడత. మన నడత సక్రమమైనదిగా వుంటుండాలి. నడత చక్కగా లేనివాడు ఎంతగొప్పవాడైతే మనకేమి?

**గొప్ప చదువులుండి స్వల్పగుణంబున్న**
**ఖ్యాతి యేమి వాని కీర్తి ఏమి?**

అల్పమైనది, చిన్న వస్తువుండినప్పటికిని గొప్ప వుపయోగము చేసుకొనేవాని కీర్తి చాలా గొప్ప కీర్తి. గోవుపాలు చిన్న గరిటెడైనా పవిత్రమే! Barrels of donkey milk ఎందుకు? ఈనాటి చదువులంతాకూడను వట్టి డిగ్రీలు సంపాదించేందుకే! కలక్టరు కావచ్చును, మినిష్టరుగావచ్చును, ఏదైనా IAS officer కావచ్చును. ఎవరైనా కావచ్చును. కాని, యీ చదువులంతా దేనికోసం? యీ చదువులు, పదవులు అన్నీ దుడ్డుదగ్గరకే నడిపిస్తున్నాయి కాని దైవముయొక్క పాదసన్నిధికి నడిపించటంలేదు. కనుక, గొప్ప గుణమును పెంచుకోవాలి. ఎవరైనా చూస్తే 'ఆహా! యితను గొప్ప విద్యావంతుడు' అనిపించుకోవాలి. మన నడత, మన వేషము, ఆచరించే కర్మలు అన్నీ తప్పక విద్యార్థియొక్క రూపాన్ని నిరూపించాలి. ఈనాడు రూపాలు చూస్తే beggars మాదిరి వుంటారు. అలాంటి వారిని beggar అనేదా, officer అనేదా? తాను ఆఫీసరు అనుకొనేవాని రూపము, గుణములు, ప్రవర్తన ఆఫీసరుకు తగినట్టుగా వుండాలికదా! ఈనాడు మన నడతలంతాకూడను దినదినానికి చాలా హీనస్థితికి దిగజారి పోతున్నాయి. ఇది సరికాదు. మానవుడిగా పుట్టినందుకు మనం మానవత్వాన్ని నిరూపించాలి. మానవత్వమనగా ఏమిటి? దివ్యత్వమును పరికింపచేసేది మానవత్వము. ఇదియే నీతియొక్క సరైన మార్గము. నీతి అనగా పాపభీతి, దైవ ప్రీతి, సంఘనీతి కలిగియుండటం. మానవత్వానికి తగిన గౌరవము, దేశాభిమానము, దేహాభిమానము, విద్యాభిమానము యివి వుంటుండాలి. అది లేనేలేదు యీనాడు. దేశాభిమానమంటే 'నేను భారతీయుడను, నా భారతదేశానికి నేను



sri sathyasai vacharamrutam

స్వప్నమునందైననూ ద్రోహము చేయకూడదు', అని గట్టి విశ్వాసము ఏర్పరుచుకోవడం.

**తండ్రిగా జీవించటానికి యోగ్యత వుండాలిగాని, తండ్రి కావటానికి యోగ్యత అవసరం లేదు**

"నాయొక్క blood, నాయొక్క head, నాయొక్క food, మా parents gift. కనుక, మొట్టమొదట parents కు gratitude చూపాలి", అనుకోవాలి. Parents కు gratitude యివ్వని వ్యక్తిని public గా శిక్షించినా పాపంలేదు. ఎందుకంటే, తల్లితండ్రులకు గౌరవాన్ని యివ్వని పుత్రుడు వాడొకపుత్రుడా? 'పున్' అనే పదమునుండి వచ్చింది పుత్రుడు. అనగా పునీతుని గావించేవాడు, పుత్రుడని అర్థము. తల్లితండ్రుల గర్భములో పుట్టినందుకు వారు, శాంతిసంతోషములతో జీవించటానికి తగిన కృషి చేసేవాడే నిజమైన పుత్రుడు. అలాంటివాడు కానప్పుడు వాడు పుత్రుడు కాదు, శతృవు. పవిత్రమైన భారతదేశములో పుట్టాము. అలా పుట్టి పిల్లలు యీ విధమైన మార్గములో ప్రవర్తించటానికి మూలకారణము నిజానికి, తల్లితండ్రులే! అసలు తల్లితండ్రులవడానికి పెద్ద యోగ్యత ఉండనక్కరలేదు. తండ్రిగా జీవించటానికి యోగ్యత వుండాలిగాని, తండ్రికావటానికి యోగ్యత అవసరం లేదు. ప్రపంచములో ఈనాడు కుమారుడు పుడితే స్వీట్సు అందరికి పంచుతుంటారు. పందికి పది పిల్లలు పుడుతున్నాయి. ఏ చక్కెర పంచుతుంది, అది? ఇదా మనము సంతోషించవలసినది? ఆ కుమారుడు ఏనాడు వంశానికి సత్కీర్తి తెచ్చాడో ఆనాడు మనము చక్కెర పంచాలి, పుట్టిన వెంటనే చక్కెర పంచటంకాదు. వారు సత్కీర్తిని తెచ్చిన దినము చక్కెర పంచాలి. యోగ్యతలేని తల్లితండ్రులు అయోగ్యులనే చెప్పవచ్చు. పిల్లలపై ప్రేమ వుండవచ్చు. కాని, పిల్లలు సరైన మార్గంలో నడుచుకుంటున్నారో లేదో చూసుకోకుండా వున్న వాళ్లంతా ధృతరాష్ట్రులు. కన్నులుండి గ్రుడ్డివారే వారు! తనకొడుకులను అదుపులో పెట్టుకోలేని ధృతరాష్ట్రుని గతి యేమైపోయింది చివరకు? రాజ్యము భ్రష్టుపట్టిపోయింది. కీర్తిభంగమైపోయింది. సర్వము నాశనమైపోయింది. ఆ కారణముచేతనే

**కొడుకులు పుట్టరటంచు ఏడ్తురు అవివేకుల్ జీవనభ్రాంతులై**
**కొడుకుల్ పుట్టరే కౌరవేం ద్రులకనేకులు వారిచే యేగతిన్ వడసిరి**

srisathyasaivachanamrutam

**కొడుకులులేని ఆ శుకునకు పెంపొందునే దుర్గతుల్**
**చెడునే మోక్షపదంబపుత్రునకున్**

అని చెప్పబడింది. కనుక, కొడుకులు కావాలనేది ఒక విధమైన మంచికోసము, చెడ్డకోసమనికాదు. పవిత్రమైన ఆదర్శము నిరూపించేకోసమని.

**రాక్షసత్వమునకుగాని, దైవత్వమునకుగాని వారి వారి గుణములే కారణము**

ప్రతి దానికికూడ ఒక Reaction, Resound, Reflection వుంటుండాది. తండ్రియొక్క తత్త్వమనేది పుత్రులలో ప్రతిబింబించాలి. అదే 'చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయతః ముఖాదింద్రశ్చ అగ్నిశ్చ' అని పురుషసూక్తములో చెప్పబడింది. చంద్రుడు మనసుయొక్క ప్రతిబింబమే! సూర్యకిరణముల ప్రతిబింబమే కంటిలో వుండేటువంటిది. అదే విధముగానే తండ్రియొక్క ప్రతిబింబమే కుమారుడుగా కావాలి. దీనికే 'ఊతలము' అని భాగవతములో పేరుంది. ఊతలమనగా కర్మవాసన. జయవిజయులు చాలా గొప్పవారు. మహావిష్ణువుయొక్క ద్వారపాలకులు. ఇట్టి స్థితి సామాన్యముగా అందరికి ప్రాప్తించేదికాదు. అలాంటి వున్నతమైన, ఉత్తమమైన, ఉత్కృష్టమైన స్థానములో జీవించినవారు. రజోగుణ, తమోగుణ ప్రభావముచే మహర్షులయొక్క (సనత్కుమారుని) శాపానికి గురైపోయారు. ఎక్కడో మహావిష్ణువుయొక్క సన్నిధియందు వుండిన జయవిజయులు రాక్షసులుగా వచ్చి పుట్టారు. కారణం ఏమిటి? వారి స్థానము చూస్తే యెంతో గొప్పస్థానము. కాని, వారిలో వేదసారమైన వినయ, విధేయతలు లేవు. ఆ వినయ విధేయతలు లేకపోవటంచేతనే యిలాంటివారు దైవసన్నిధిలో వుండకూడదని చెప్పి ఆ ఋషులు శాపము ఇచ్చారు. వారు రాక్షసులుగా వచ్చి పుట్టారు.

సాక్షాత్ రాక్షసుడైనవాడు హిరణ్యకశిపుడు. అతని భార్యయైన లీలావతి గర్భమునుండి పుట్టిన ప్రహ్లాదుడు. నారదునియొక్క బోధచేతను, ఉపదేశముచేతను మహాభక్తునిగా మారిపోయాడు. రాక్షస గర్భమునుండి పుట్టినవాడు దైవత్వమును పొందాడు. దైవసన్నిధిని వుండినవాడు, రాక్షసత్వమును పొందాడు. దీనికి కారణమేమిటి? వారి వారి గుణములే కారణము. కనుక, మానవునియందు పుట్టిన వారైనప్పటికిని, ఆకారము

srisathyasaivachanamrutam

మానవుడైనప్పటికిని గుణము రాక్షసగుణము వుంటుంటే వారు రాక్షసులేకాని మానవులుకాలేరు. అదే విధముగా రాక్షసుడుగా పుట్టి గుణములు దైవ గుణములుగా వుంటుంటే వాడు దైవమేగాని రాక్షసుడుకాదు. మంచిచెడ్డలకు గుణములే ప్రమాణము, ఆధారముగాని, జన్మ, రూపములు కావు. కనుక, మనము యీనాడు గుణములు అభివృద్ధి పరచుకోవాలి. మన నడతలు పవిత్రమైనవిగా ఉండేటట్లు చూచుకోవాలి. అట్టి నడతలులేని జీవితము, జీవితముకాదు. మానవునికి వేదములు ప్రమాణములు. వినయ, విధేయతలు ఋగ్వేదముయొక్క సారము. ధారణాశక్తి అనగా మనము విశ్వసించినది. ఎన్నియిబ్బందులు కల్గినప్పటికి, ఎన్ని యిక్కట్లు కల్గినప్పటికి, ఎన్ని మనకు అడ్డులు తగిలినప్పటికిని యేమాత్రము చలించకుండా మనము ధారణాశక్తిని నిలుపుకోవాలి. ఇదియే యజుర్వేదముయొక్క సారము. ఈ రెండింటియందు మానవత్వమును యెంతైనా అభివృద్ధిపరచుకోవచ్చు. మూడవది, సామవేదముయొక్క సారము, విజ్ఞత. ఎవరి దగ్గర యేవిధముగా మెలగాలి, పెద్దల దగ్గర యేరీతిగా అణకువగా వుండాలి, యేరీతిగా మనము మాట్లాడాలి, అధికారుల దగ్గరికి పోయినప్పుడు మనము ఎలావుండాలి, మన యింటికి వచ్చినవారిని మనము యేరీతిగా గౌరవించాలి, భగవంతుని దగ్గర యేరీతిగా వుండాలి, ఈ విధముగా సయమస్ఫూర్తిగా విజ్ఞతను ప్రకటించే తత్త్వమే సామవేదముయొక్క సారము.

మానవునకు ప్రాణ సమానమైన గుణములు నాలుగు-వినయ విధేయతలు, ధారణశక్తి, విజ్ఞత మరియు యీ నాల్గింటిని సమన్వయము చేసే ప్రేమతత్త్వము. ఈ పంచప్రాణములు ప్రకటింపచేసినవే యీ మూడు వేదములు. ఈ మూడు వేదములకు పురాణపురుషులైన, మంత్రదష్టలైనవారు 'త్రయీ' అని పేరు పెట్టారు. త్రయీ అనగా మూడు అని. నిజానికి మానవుని గుణములుకూడను మూడే, సత్త్వరజోతమోగుణములు. మానవుని దేహభాగములు మూడే, శిరస్సు, ఉదరము, పాదము. కనుక, యీ మూడింటియొక్క తత్త్వములో దైవముయొక్క యదార్థ స్వరూపాన్ని నిరూపిస్తూవచ్చింది. శివపూజ చేసేవారు యీ మూడింటిని ఆధారముగా తీసుకుంటారు. బిల్వపత్రము వుంటున్నాది.

**త్రిగుణం త్రిదళాకారం త్రినేత్రంచ త్రియాయుధం**

srisathyasaivahini.org

త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణమ్

అన్నారు. Past, present and future యీ మూడు కాలములను మనము పవిత్రము చేసుకోవాలి. ఈనాడు దేశములో ఆవరించిన అశాంతికి కారణమేమిటి? వర్తమానాన్ని మనము మరచిపోతున్నాము యిప్పుడు. వృద్ధులైన వారంతాకూడను నిరంతరము గతమును చింతిస్తూపోతున్నారు. నా పెండ్లప్పుడు యిట్లావుండినాది, నాయొక్క ఉద్యోగ సమయములో యిట్లావుండినాది ఆ కాలమే బాగుండినాది అని గడచిపోయిన కాలమును వర్ణిస్తూవుంటారు.

**(తేదీ 26-04-1986న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam